క్లుప్తంగా

రామకృష్ణ పరమహంస బోధనలు ఆదర్శం



మాచర్ల : భగవాన్ రామకృష్ణ పరమహంస బోధనలు అందరికీ ఆదర్శమని, ఛత్రపతి శివాజీ ధైర్యానికి ప్రతిరూపమని స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ మెట్టు గోవింద రెడ్డి అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్వామి వివేకానంద సేవాశ్రమంలో రామకృష్ణ పరమహంస 190వ, ఛత్రపతి శివాజీ 395వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులు, పిల్లలతో వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మెడిటేషన్ మాతాజీ టి.ఇందిరాదేవి, వి.హరిబాబు, బి.సత్యనారాయణ రాజు, ఎం.చంద్రశేఖర్ రెడ్డి, ఎం.పాపిరెడ్డి, పి.శ్రీనివాసరావు, వి.నాగమణి, ఎస్.కృష్ణవేణి జి.నాగలక్ష్మి, సుందరమ్మ బికారి నాయక్, బాలాజీ నాయక్, మారుతి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



మాచర్ల : ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు ఔరంగాబాద్‌లో జరిగిన 68వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు మాచర్ల సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు మత్తే భూపేంద్ర కుమార్, మత్తే విజయలక్ష్మి ప్రాతినిధ్యం వహించారు. ప్రతిభ కనబరిచి జట్టు విజయంలో ప్రధాన పాత్ర వహించిన క్రీడాకారులను ప్రిన్సిపల్ సిస్టర్ మరియ సుజాత పాఠశాల ఆవరణలో బుధవారం అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలని ప్రిన్సిపల్ ఈ సందర్భంగా సూచించారు. సిస్టర్ శ్వేత, పీఈటీలు కుమార్, ప్రతాప్, ఉపాధ్యాయులు సంతోష్, వెంకట్, రత్న ప్రకాష్, వినేష్, ప్రసాద్, కొండలు, నాగేశ్వరరావు, ప్రేమ్, మెర్సీ, సబిత, మధుర వాణి, అనుషా పాల్గొన్నారు.

మసీదులో జోర్డాన్ దేశస్తుల నమాజ్



దాచేపల్లి : మండలంలోని గామాలపాడులో ఉన్న మసీద్ ఏ మహమ్మదీయ మసీద్‌లో జోర్డాన్ దేశస్తులు బుధవారం నమాజ్‌లో పాల్గొన్నారు. గుంటూరు వైపు నుంచి హైదరాబాద్ బయలుదేరిన వీరు నమాజ్ సమయం కావడంతో హైవే పక్కన ఉన్న మసీద్‌లోకి చేరుకుని స్థానికులతో కలిసి నమాజ్ చేశారు. మసీద్ మౌలానా ముస్తాఫా వీరి యోగ క్షేమాలు తెలుసుకుని సన్మానించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే ముస్లింలు నమాజ్ చేసుకునేందుకే ఇక్కడ మసీద్ నిర్మాణం చేపట్టామని మౌలానా ముస్తాఫా వివరించారు. వీరి వెంట కౌన్సిలర్ షేక్ షరీఫ్ తదితరులున్నారు.

కార్మికులకు చర్మ వ్యాధులు



సత్రశాల(రెంటచింతల): వివిధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు వేడి, దుమ్ము కారణంగా చర్మవ్యాధులు పెరుగుతున్నాయని చర్మ వ్యాధుల నిపుణులు డాక్టర్ ప్రవీణ్ అన్నారు. బుధవారం మండలంలోని సత్రశాల వద్ద నున్న ఏపీ జెన్‌కో టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాజెక్టులో పని చేస్తున్న ఉద్యోగులకు పలు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పరిశ్రమలలో పని చేస్తున్న సమయంలో అత్యధికంగా ఉష్ణోగ్రత ఉంటుందని, కార్మికులు తప్పనిసరిగా ముఖానికి గుడ్డ కట్టుకోవాలని సూచించారు. దుమ్ము వల్ల కార్మికులకు జుట్టు కూడా ఊడిపోతుందన్నారు. అనంతరం వైద్యుడు ప్రవీణ్‌ను టెయిల్‌పాండ్ వైద్యుడు ఎన్. మధుబాబు, అధికారులు ఘనంగా సన్మానించారు.

మెరుగైన విద్యుత్ అందించాలి

మాచర్ల : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ డాక్టర్ పి.విజయకుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింగయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బకాయిలు లేకుండా విద్యుత్ బిల్లులు వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు ఏర్పడితే వెంటనే స్పందించాలన్నారు. డివిజన్ పరిధిలో అన్ని మండలాల్లో ఎప్పటికప్పుడు విద్యుత్ బిల్లులు వసూలు చేసి, విద్యుత్ శాఖ ఆదాయం పెంచాలన్నారు. దీనిలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. విద్యుత్ బకాయిలు వసూలుకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సమష్టి కృషి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అకౌంట్స్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు కావాలి

- ఇన్‌చార్జి తహసీల్దారు, ఎంపీడీఓలతో దాచేపల్లి పాలన
- బదిలీపై వెళ్లిన అధికారులు
- సర్టిఫికెట్లు, భూ సమస్యల పరిష్కారంలో జాప్యం
- రెవెన్యూ ఫైళ్లకు పిడుగురాళ్లలో మోక్షం
- కార్యాలయాల చుట్టూ అర్జీదారుల ప్రదక్షిణలు



దాచేపల్లి తహసీల్దార్ కార్యాలయం

దాచేపల్లి : గురజాల రెవెన్యూ సబ్ డివిజన్ పరిధిలో పెద్ద మండలంగా చెప్పుకునే దాచేపల్లిలో పాలన పడకేసింది. చిన్న చిన్న పనులకు సైతం ఫైళ్లను ఎత్తుకుని పక్క మండలంలో పనిచేస్తున్న ఇన్‌చార్జి అధికారి వద్దకు పరుగెత్తుతున్నారు సిబ్బంది. విద్యార్థులు, రైతులకు అత్యవసరమైన సర్టిఫికెట్ల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతుండటం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్, ఎంపీడీవో బదిలీ చేసి, కొత్తగా రెగ్యులర్ అధికారులను నియమించలేదు.

నెలలు గడుస్తున్నా.. చేపట్టని నియమకాలు

తహసీల్దార్ వైవీ కుటుంబరావు సెలవుపై గత నెలలో వెళ్లారు. సెలవులు ముగిసిన తరువాత ఇక్కడకు ఆయన్ను పంపించకుండా గురజాల ఆర్డీవో కార్యాలయం ఏవోగా పోస్టింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో డిప్యూటి తహసీల్దార్ రాజాని కొన్ని రోజుల పాటు ఇన్‌చార్జీ తహసీల్దార్‌గా పనిచేశారు. ఆ తర్వాత పిడుగురాళ్ల తహసీల్దార్ మధుబాబుకు ఇక్కడ ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జిగా మధుబాబు అవకాశాన్ని బట్టి ఇక్కడకు వచ్చి వెళ్తున్నారు. అలాగే ఎంపీడీవో రామకృష్ణ కూడా బదిలీపై రాష్ట్ర సచివాలయానికి గతేడాది డిసెంబర్‌లో వెళ్లారు. కార్యాలయం సూపరింటెండెంట్ పప్పుల రత్నం ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతలు తీసుకున్నారు. మండల అభివృద్ధి, సంక్షేమంలో ప్రధాన భూమిక పోషించాల్సిన శాశ్వత తహసీల్దార్, ఎంపీడీఓలు లేకపోవడంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

గాడి తప్పుతున్న పాలన

మండలానికి రెండు కళ్లులాంటి తహసీల్దార్, ఎంపీడీఓలు లేకపోవడం వల్ల పాలన గాడితప్పుతోంది. విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటే అవి చేతికి అందేసరికి రోజులు పడుతున్నాయి. ఒక సర్టిఫికెట్ కోసం రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఇక్కడ ఫైళ్లను పిడుగురాళ్లకి తీసుకెళ్లి అక్కడ తహసీల్దార్ పరిశీలన చేసి, సంతకం చేసిన తర్వాత ఇక్కడకు తీసుకొస్తున్నారు. భూ సమస్యలపై రైతుల అర్జీలు కూడా పిడుగురాళ్లకి వెళ్లి తిరిగొస్తున్నాయి. ఇటీవల పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల కావడంతో.. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. వేసవి రాకముందే ఇప్పటికే గ్రామాల్లో మంచినీటి సమస్య ఉత్పన్నమవుతోంది. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఎంపీడీవోపై ఉంది. రెగ్యులర్ ఎంపీడీవో కోసం మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైన స్పందించి పూర్తిస్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవోలను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా శివాజీ జయంతి



నివాలులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా ఛత్రపత్తి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా న్విహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కేతావత్తు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ.. పరిపాలన విధానంలో, యుద్ధ తంత్రంలో భారత దేశ రాజులలో శివాజీ మహారాజ్ అగ్రగణ్యుడన్నారు. గురజాల నియోజక వర్గ కో-కన్వీనర్ వడ్లమూడి వెంకయ్య, జిల్లా కార్య వర్గ సభ్యులు ఉమా మహేశ్వరరావు, పట్టణ జనరల్ సెక్రటరీ మణికంఠ, ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి ఉడత ప్రసాదరావు పాల్గొన్నారు.

ఛత్రపతికి నివాళి

మాచర్ల: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పాతూరులోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ప్రదర్శనలో పలువురు పాల్గొని ఛత్రపతి శివాజీకి నివాళులర్పించారు. భజరంగ్ దళ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

దాచేపల్లి: ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతిని బుధవారం దాచేపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయాత్ర చేపట్టారు. పలువురు స్థానిక నాయకులు తొలుత వీర్ల అంకమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం దాచేపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కారంపూడి రోడ్డు నుంచి లైబ్రరీ సెంటర్ మీదుగా నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లా వరకు ర్యాలీ కొనసాగింది. ఛత్రపతి శివాజీ మహారాజ్‌కి జై నినాదాలతో దాచేపల్లి దద్దరిల్లింది. అనంతరం నిర్వహించిన సభలో పలువురు నేతలు మాట్లాడి ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత చరిత్రను క్లుణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యేలూరి శశికుమార్, నాగేశ్వరరావు, ప్రభాకర్‌రావు, కొప్పుల గిరి పాల్గొన్నారు. పోలీసు బందోబస్తు నిర్వహించారు.

పట్టపగలే చోరీ

రెంటచింతల: మండల కేంద్రంలో బుధవారం పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఆరోగ్యపురం కాలనీకి చెందిన మంచి రామకృష్ణ ఉదయం 9 గంటలకు జీవాలను పొలాకి మేత కోసం తోలుకెళ్లాడు. భార్య సుజాత పొలం కూలి పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ఇంట్లోని బీరువాను పగలగొట్టి దాచుకున్న రూ.30 వేలు నగదు, బంగారపు నగలు చోరీకి గురైనట్లు గుర్తించింది. విషయాన్ని భర్తకు తెలియజేయడంతో రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం రాత్రి గ్రామంలోని ఆదూరి ఇన్నారెడ్డి, తాళ్లూరి సాంబశివరావు నివాసాలలో చోరీలు జరిగాయి. రెండు రోజుల్లో మూడు ప్రాంతాల్లోని మూడు ఇళ్లల్లో దొంగతనాలు జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చోరీ కేసు విచారణ

రెంటచింతల: గ్రామాలలో అనుమానితులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గురజాల డీఎస్పీ పి. జగదీష్ అన్నారు. మండల కేంద్రమైన రెంటచింతలలో మంగళవారం రాత్రి చోరీకి గురైన ఆదూరి ఇన్నారెడ్డి, తాళ్లూరి సాంబశివరావు ఇళ్లను ఆయన బుధవారం సందర్శించారు. బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు అందరూ ఇంటిని విడిచి మరో గ్రామానికి వెళ్లు సమయంలో ఖచ్చితంగా పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలని సూచించారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు. కారంపూడి సీఐ శ్రీనివాసరావు, స్థానిక ఎస్ఐ సీహెచ్ నాగార్జున ఉన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

కారెంపూడి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఈజీఎస్) కింద మండలంలో 2023-24లో జరిగిన రూ.9,74,59,119 విలువైన పనులపై బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో సోషల్ ఆడిట్ జరిగింది. ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీలు ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి సమక్షంలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. గ్రామాల వారీగా ఆయా గ్రామాలలో జరిగిన పనుల వివరాల ప్రకారం నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. పనుల్లో జరిగిన లోపాలను ఎత్తి చూపారు. ఆడిట్‌లో లోపాలను గుర్తించి రూ.1,64,563లను రికవరీ చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి ఆడిట్ బృందాలు నివేదించాయి.

తుప్పు పడుతున్నాయి సారూ..

మూలకు చేరిన వీల్‌చైర్స్



ఎంపీడీఓ కార్యాలయంలో మూలన పడేసిన వీల్‌చైర్స్

మాచర్ల రూరల్: ప్రభుత్వాధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనానికి తుప్పుపడుతోంది. దివ్యాంగులు, వయో వృద్ధులు వినియోగించాల్సిన వీల్ చైర్స్ ఎంపీడీఓ కార్యాలయంలో మూలకు చేరాయి. తుప్పు పడుతూ ఎందుకూ పనిరాకుండా పోతున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటు వేసేందుకు వచ్చేవారి సౌకర్యార్థం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెద్ద ఎత్తున వీటిని కొనుగోలు చేశారు. ఎన్నికలు ముగిసిన అనంతరం వాటిని సంబంధిత మండల పరిషత్ కార్యాలయాలకు అందించారు. రూ.లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన వీల్ చైర్స్‌ను పట్టణ, గ్రామీణ ప్రభుత్వ వైద్యశాలలకు, ఆరోగ్య కేంద్రాలు, అనాథ, వృద్ధాశ్రమాలు, దివ్యాంగుల పాఠశాలలకు ఉచితంగా అందిస్తే వారికి ఉపయోగపడుతాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తుప్పుపట్టి పోతున్న వీల్ చైర్లను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రామకృష్ణ బోధనలు ఆచరణీయం



రామకృష్ణ పరమహంస చిత్రపటం ఊరేగింపు

రెంటచింతల: రామకృష్ణ పరమహంస బోధనలు ప్రస్తుత సమాజానికి ఆచరణీయమని రెంటచింతల రామకృష్ణ సేవా మండలి అధ్యక్షుడు గుంటక కాశిరెడ్డి అన్నారు. బుధవారం రామకృష్ణ పరమహంస జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రామకృష్ణ సేవామండలి సభ్యులు, మహిళలు, రామకృష్ణ గురుకుల పాఠశాల విద్యార్థులతో కలసి భజనలు, కీర్తనలు పాడుతూ రామకృష్ణ పరమహంస చిత్రపటాన్ని గ్రామ పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాళం పెదబాబు, గుండా రామ్మూర్తి తదితరులున్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

ఏడీఏ హనుమంతరావు



కస్తలలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ

అచ్చంపేట: వచ్చే నెలలో కేంద్రప్రభుత్వం విడుదల చేసే పీఎం కిసాన్ యోజన పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమకావాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా కలిగి ఉండాలని వ్యవసాయ సహాయ సంచాలకులు వి.హనుమంతరావు తెలిపారు. మండలంలోని కోనూరు, కస్తల గ్రామాలలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. వ్యవసాయ భూములు కలిగిన రైతులంతా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, ఆధార్‌లింకైన ఫోను నెంబరుతో రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు. అన్నదాత సుఖీభవ నగదు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర ప్రభుత్వ రాయితీలు పొందాలన్నా, పండించిన పంటలను మద్దతు ధరలకు అమ్ముకోవాలన్నా విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏఓ పి.వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ సిబ్బంది హర్ష, షరీఫ్, రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో...

క్రోసూరు: మండలంలోని నాగవరం ,హసనాబాద్ గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో ఏఓ వేణుగోపాల్ పాల్గొని మాట్లాడారు. ఈ రబీ సీజన్‌లో మండలంలో రైతులు వరి, శనగ, మొక్కజొన్న, పొగాకు మొదలగు పంటలను సాగు చేశారన్నారు. ఈ-పంట యాప్ ద్వారా ఈ-క్రాప్‌ను రైతు సేవా కేంద్ర సిబ్బంది నమోదు చేస్తున్నారని చెప్పారు. ఈ-క్రాప్ చేయించుకోవడానికి ఈనెల 25 వ తేదీ ఆఖరు తేదీఅని, పంటలు వేసిన రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి వారు వేసిన ఈ-క్రాప్ నమోదై ఉందా, లేదా సరి చూసుకోవాలని కోరారు. రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కండ్లకుంట, చాగల్లులో...

నకరికల్లు: రబీసీజన్‌లో పంటలు సాగుచేస్తున్న రైతులు రైతుసేవ కేంద్రాల్లో సంప్రదించి ఫార్మర్ ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని కండ్లకుంట, చాగల్లులో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో 11 అంకెల ఫార్మర్ రిజిస్టర్ ఐడీ నంబర్ పొందాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.శ్రీను, వీహెచ్ఏ కె.వెంకటకృష్ణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన



సత్తెనపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు సాంకేతిక పరిజ్ఞానంతో విద్య అందించాలని ఐసీడీఎస్ సత్తెనపల్లి సీడీపీఓ టి.శ్రీలత అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమంలో బుధవారం ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ ఆరు రోజులపాటు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏసీడీపీఓ సంతోష కుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలకు పునాది వేయడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. సూపర్‌వైజర్ పి.ప్రమీల మాట్లాడారు. చిన్నారులకు ఏ విధంగా బోధించాలనే అంశంపై డీఆర్పీలు శిక్షణ ఇచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సవాల్ స్వీకరించాల్సిన అవసరం నాకు లేదు

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: గతంలో తాను విసిరిన సవాల్‌ను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్వీకరించలేదని, ఆయన విసిరిన సవాల్‌ను స్వీకరించాల్సిన అవసరం తనకు లేదని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. నరసరావుపేటలో తన నివాసంలో బుధవారం ఆయన ఒక వీడియోను రిలీజ్ చేశారు. పిడుగురాళ్ల మెడికల్ కళాశాల టీడీపీ ప్రభుత్వంలో మంజూరు కాలేదని, అలా అయ్యిందని నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని, నిరూపించలేకపోతే యరపతినేని రాజకీయాల నుంచి తప్పుకోవాలని సవాల్ విసిరినట్లు గుర్తుచేశారు. అప్పుడు తన సవాల్‌ను యరపతినేని స్వీకరించలేదన్నారు. దీంతో తానూ స్పందించలేదన్నారు. ఇప్పుడు ప్రతి సవాల్ విసిరే అర్హత ఆయనకు లేదన్నారు.

సమస్యలపై పోరాడుతా



మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణ్‌రావు

గురజాల: తనను బలపరిచి, పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించాలని కేఎస్ లక్ష్మణ్ రావు పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పట్టభద్రులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా రాజకీయ జోక్యం వస్తోందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నుకుంటే నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేసి, సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీగా గెలిపించండి

దాచేపల్లి : రాజ్యాంగ విలువలకు కట్టుబడి ప్రజల సమస్యలను శాసన మండలిలో లేవనెత్తె సత్తా పీడీఎఫ్ ఎమ్మెల్సీలకు మాత్రమే ఉందని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని అభ్యర్థి కేఎస్. లక్ష్మణరావు కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బుధవారం ఆయన దాచేపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఓటర్లను కలిసి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం నారాయణపురంలోని యూటీఎఫ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2007లో శాసన మండలిని పునరుద్ధరించిన తర్వాత 14 మంది పీడీఎఫ్ అభ్యర్థులు ఎమ్మెల్సీలుగా విజయం సాధించారని గుర్తుచేశారు. పల్నాడు జిల్లా సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధిలో భాగస్వాములు అయ్యామని, కార్పొరేట్ వ్యక్తులను కాకుండా ప్రజల పక్షాన నిలిచే పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏపూడి గోపాలరావు, ఆంజనేయరాజు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్:పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు అన్నారు బుధవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సుదీర్ఘ విద్య, రాజకీయ ప్రయాణంలో ఎమ్మెల్సీగా ప్రజా ఉద్యమాలే బలంగా సమస్యలపై పోరాటం చేసినట్లు తెలిపారు. పట్టభద్రులందరూ ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో లక్ష్మణరావు పేరు ముందు 1 అంకె వేసి మద్దతు తెలపాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు, నాయకులు బండ్ల మహేష్, వెంకటరావు, సురేష్, శోభన్‌బాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, జ్యోతిష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: ప్రభుత్వ, ప్రైవేటు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని పీడీఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని ఆయన బుధవారం పర్యటించారు. ప్రభుత్వం హామీలను అమలు చేసే విధంగా కృషి చేస్తానని అంగన్‌వాడీలకు చెప్పారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లరూరల్: ప్రైవేటు స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు అన్నారు. జానపాడు గ్రామ శివారులోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో ప్రైవేటు ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు.

పశువుల దొంగలు అరెస్టు

పది ఆవులు, నాలుగు గేదెలు, ఎద్లు స్వాధీనం..

వెల్దుర్తి: పశువుల దొంగతనం చేస్తూ, వాటిని విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సా చేస్తున్న ముగ్గురు దొంగలను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురజాల డీఎస్పీ జగదీష్ బుధవారం వివరాలు వెల్లడించారు. మండలంలోని కండ్లకుంటకు చెందిన సూదెనబోయిన ఏసుబాబు, గొలసం శ్రీకాంత్, కొత్త పుల్లారెడ్డి గూడేనికి చెందిన ఐనబోయిన శ్రీకాంత్ అడవికి మేతకు వెళ్లిన పశువులను దొంగిలిస్తుంటారు. వాటిని ఒక చోటకు చేర్చి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఎస్ఐ సమందర్ ముగ్గురు దొంగలను అదుపులోకి తీసుకొని, విచారించగా దొంగిలించిన పశువులు ఉన్న చోటను చూపించారు. పది ఆవులు, నాలుగు గేదెలు, రెండు ఎడ్లను వెల్దుర్తి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. స్టేషన్‌లో ఫిర్యాదిచ్చిన బాధిత పశుపోషకులకు తమ పశువులను గుర్తించాలని అప్పగించటం జరిగిందన్నారు. కొత్తపుల్లారెడ్డి గూడేనికి చెందిన మక్కెన శంకర్ తన ఎడ్లు దొంగిలించారని ఈ నెల 6న ఫిర్యాదిచ్చినట్లు తెలిపారు. శిరిగిరిపాడు చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో ముగ్గురు దొంగలు తారసపడినట్లు తెలిపారు. వారి సమాధానం అనుమానాస్పందంగా ఉండటంతో వారిని అరెస్టు చేయడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. దొంగలను పట్టుకున్న ఎస్ఐ సమందర్ వలి, సిబ్బందిని, రూరల్ సీఐ షేక్ నసీబ్ బాషాను డీఎస్పీ అభినందించారు. తక్కువ కాలంలోనే ఎస్ఐ సమందర్ వలి 8 కేజీల గంజాయి, 35 కేజీల కాపర్ వైరు, వివిధ రకాల దొంగతనాలను చేధించటంతో ఆయనకు అవార్డు కోసం ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామన్నారు.

ఆదర్శ పాఠశాల, కేజీబీవీలో తనిఖీలు

బాలికలకు పలు అంశాలపై అవగాహన, పాఠశాలల్లో పరిస్థితులు తెలుసుకున్న అధికారులు



మాట్లాడుతున్న తహసీల్దార్ వీవీ నాగరాజు, డీటీ జి.శ్రీనివాసరావు, ఎస్ఐ నాగేంద్రరావు

క్రోసూరు: ఏపీ ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను బుధవారం తహసీల్దార్ వీవీ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు, ఎస్ఐ నాగేంద్రరావులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాలు, టెక్ట్‌బుక్స్, వసతులు, చదువులు, సెక్యూరిటీపై ఏమైనా సమస్యలున్నాయా అనే అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఆరోగ్య పరీక్షలు, ఉచిత వైద్యం ఉంటుందా, ఏఎన్ఎం ఉంటున్నారా అనే అంశాలు అడిగి తెలుసుకుని పలు అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాలలో, పాఠశాల బయట బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, వాటిని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా బాలికలకు ఎటువంటి సమస్యలొచ్చినా అది పాఠశాలలో గానీ, పాఠశాల బయట గానీ తోటివారు, ఉపాధ్యాయులు తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అప్పుడు మాత్రమే జరగబోయే ప్రమాదాల నుంచి కాపాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. హాస్టళ్లలో చదువుకునే బాలికలు ఒకరికొకరు స్నేహంగా, సహకారంతో మెలగాలని, సమస్యలేమైనా ఉంటే ఉపాధ్యాయులు, హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ మేరీ సూజన్. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లిలో వేంచేసియున్న పోలేరమ్మతల్లి ఆలయ 17వ వార్షికోత్సవం బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి మంగళవాయిద్య సహిత తోరణ, సుప్రభాత సేవ, గణపతి పూజ, బ్రహ్మ కలశారాధన, పంచామృత సహిత ఏకాదశ ద్రవ్యాలతో శ్రీ పోలేరమ్మ తల్లికి, దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. 11 గంటల నుంచి దివ్య అలంకరణ అనంతరం దివ్య దర్శనం, శ్రీ చక్ర సహిత దుర్గా సహిత శ్రీ సూక్త సమేతంగా అమ్మవార్లకు దివ్య కుంకుమ పూజ, సహస్రనామ పుష్పార్చన, గాజుల అలంకార సేవ, విశేష పూజా కార్యక్రమాలు, ధూప దీప నైవేద్య సహిత తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం భజన సంకీర్తనలు, లలితా సహస్ర నామ పారాయణం, దీపోత్సవం చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.